# సెమిస్టరు - 3. తెలుగు

## సృజనాత్మక రచన

### వ్యాసం - లక్షణాలు

వ్యాసం విషయప్రకటనకు అనువైన ప్రక్రియ. దీనిలో ఎంతో వైవిధ్యం ఉంటుంది. వ్యాసంలో ఒక విషయాన్ని అర్థవంతంగా, స్పష్టంగా చెప్పవచ్చు. గంభీరమైన అంశాన్ని తేలికగా అర్థమయ్యేటట్లు, సులభమైన అంశాన్ని గంభీరంగాను చెప్పే అవకాశమున్న ప్రక్రియ వ్యాసం. ఏ అంశాన్ని గురించైనా గంభీరంగా రాసినా, తేలికగా రాసినా, సంక్షిప్తంగా రాసినా, సమగ్రంగా రాసినా వ్యాసంలో ఒక క్రమపద్ధతి ఉంటుంది. అసలు విషయాన్ని వదిలి ఇతర అంశాల చర్చ ఇందులో కనిపించదు. శాఖాచంక్రమణం కనిపించదు. వ్యాసం ఏ విషయం గురించైనా అది దండలో దారంలాగా అంశం చుట్టూనే తిరుగుతూ ఉంటుంది.

విమర్శకుల అభిప్రాయం ప్రకారం తెలుగు వ్యాసంలో ఏడు లక్షణాలుంటాయని గుర్తించారు. అవి 1. వచనత్వం 2. అనిర్ణీతత్వం 3. మిత్రత్వం. 4. హాస్యత్వం 5. సృజనత్వం 6. అసంపూర్ణత్వం 7. వ్యక్తిత్వం.

వీటిగురించి వివరంగా తెలుసుకుందాం.

1 వచనత్వం:- వ్యాసం ఎప్పుడూ వచన రూపంలోనే ఉండాలి. కవిత్వ ప్రక్రియగా ఉండకూడదు. కొంతమంది రచయితలు కవితాత్మకంగా వ్యాసాలు రాసినా వచన నియమాన్ని పాటించారు.

2. అనిర్ణీతత్వం:- ఏ రచనాప్రక్రియకైనా ఒక పరిమితి ఉంటుంది. దానిని ఇతివృత్తం, సన్నివేశం ఆధారంగా నిర్ణయించాలి. వ్యాసం ఇక్కడ పూర్తి కావాలి అనే నియమం ఏదీ ఉండదు. ఒక రచయిత ఆలోచనల్లో ముగిసిన వ్యాసం, అమ్మో అక్కడి నుండి కొత్తగా మొదలు కావచ్చు. అయితే వ్యాసం స్వల్ప కాలంలో చదవడానికి, కొద్ది పుటల్లో ప్రచురించడానికి వీలుగా ఉంటే బాగుంటుంది.

3. మిత్రత్వం:- వ్యాసం పాఠకులకు మిత్రునిగా అనిపించాలి. మిత్రునికి తన అభిప్రాయం చెబుతున్నట్లు, ముచ్చటిస్తున్నట్లు, వ్యాసకర్త ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాఠకుల పట్ల మైత్రిని ప్రదర్శిస్తున్నట్లు, మైత్రీపూర్వకంగా ఉన్నట్లు తన వ్యాసం ద్వారా అభిప్రాయాన్ని కలుగజేయాలి.

4. హాస్యత్వం:- హాస్యం ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. శక్తిని ఇస్తుంది. వ్యంగ్యం, పరిహాసం, అధిక్షేపం పాఠకునికి జీవిత సత్యాలను తెలియజేస్తాయి. వ్యాసంలో హాస్యం ఉంటే పాఠకులు దాని నుంచి దూరం కారు. అలాగని అన్ని రకాల వ్యాసాలకు హాస్యలక్షణం వర్తించదు.

5. సృజనత్వం – వ్యాసంలో పాండిత్య ప్రకర్ష ఉండకూడదు. వ్యాసం సృజనాత్మకంగా కొత్త ఆలోచనలతో కూడి ఉండాలి. సృజనలో రచయిత ఆత్మీయత కనిపిస్తుంది. రచయిత హృదయం నుండి వెలువడిన భావాలు పాఠకుల హృదయాలకు చేరువ అవుతాయి.

6. అసంపూర్ణత్వం – వ్యాసం పరిధి చిన్నది అయినా, పెద్దది అయినా, అందులోని విషయం పూర్తిగా సమగ్రంగా ఉండదు. అది అసాధ్యం కూడా. వ్యాసానికి అసంపూర్ణత్వం కూడా ఒక లక్షణమే అంటే వ్యాస విషయానికి ఇంకా కొనసాగింపు ఉంటుందని అర్థం.

7. వ్యక్తిత్వం – వ్యాసంలో రచయిత వ్యక్తిత్వం ఆత్మాశ్రయ రీతిలో ఉంటుంది. వ్యాసాన్ని రచయిత పాత్రగతంగా రాసినా, ఉత్తమ పురుషలో రాసినా, వ్యాసం పాఠకునితో మాట్లాడినట్లు ఉండాలి. రచయిత దృక్పథం, అనుభవం, అవగాహన వ్యాసంలో ప్రస్ఫుటంగా కనిపించాలి. రచయిత వ్యక్తిత్వం పెరిగితే వ్యాసంలో సృజనత్వం పెరుగుతుంది.

వ్యాసంలో పైన చెప్పిన లక్షణాలన్నీ ఉండాలనే నియమమేమీ లేదు. వ్యాసంలో తప్పకుండా ఉండవలసిన లక్షణం చదివించే గుణం. అది రచయిత నైపుణ్యంపై ఆధారపడి ఉంటుంది. రచయిత నైపుణ్యం కలిగిన వాడయితే అతని వ్యాసం ఉత్తమ శ్రేణికి చెందినదిగా నిలుస్తుంది. వ్యాసం మంచిదయితే అది పాఠకునికి బుద్ధి వికాసాన్ని కలిగిస్తుంది. సమాజంలో మార్పుకు దోహదం చేస్తుంది.

వీనితో పాటు క్రింది లక్షణాలు ఉంటేనే వ్యాసం ఉత్తమమైనదిగా పేరు తెచ్చుకుంటుంది.

1. వ్యాసం సుదీర్ఘంగా ఉండకూడదు. సంగ్రహంగా భావ స్ఫూర్తి కలిగేలా ఉండాలి.
2. వ్యాసానికి తగినట్లు శీర్షిక ఉండాలి. ఆ శీర్షిక కూడా ఆకర్షణీయంగా ఉండాలి.
3. వ్యాసాన్ని విషయాన్ని బట్టి విభాగాలుగా చేయాలి. ఒక్కొక్క విభాగంలో ఒక్కొక్క విషయభాగం గురించి మాత్రమే చెప్పాలి.
4. వ్యాసంలోని భాష సరళంగా, సుందరంగా, సూక్ష్మంగా ఉండాలి.

పై లక్షణాలతో ఉన్న వ్యాసం నిశ్చితంగా ఉత్తమమైన వ్యాసం అనిపించుకుంటుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.